# నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | NIZAMABAD


కొట్టుకపోయిన వాడీ తాత్కాలిక వంతెన



## 'మట్టి'కొట్టుకుపోయిన వంతెనలు

### గ్రామాల మధ్య రాకపోకలు బంద్

ధర్పల్లి/ రామారెడ్డి, జూలై 31: వాగులపై వంతెనల నిర్మాణంలో జాప్యం ఏర్పడడంతో వానకాలంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాగులు పారి వంతెనల వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలకు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని వాడీ-హొన్నాజీపేట్ గ్రామాలకు బుధవారం తెల్లవారుజాము నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. వాడీ సమీపంలో ప్రధాన వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. అందుకోసం పక్కనే సిమెంట్ పైపులు వేసి తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షంతో వాగులో ప్రవాహం ఎక్కువై తాత్కాలిక వంతె న కొట్టుకుపోయింది. దీంతో వాడీ-హొన్నాజీపేట్ గ్రామాల మధ్య కిలోమీటరు దూరానికి 15 నుంచి 20కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఉధృతంగా ప్రవహించింది. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తుండగా వరద ఉధృతికి తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో పోసానిపేట్, కన్నాపూర్, గర్గుల్ మీదుగా కామారెడ్డి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వంతెన నిర్మాణాన్ని త్వర గా చేపట్టాలని గతం లో ప్రజా ప్రతినిధులు నిరసనలు చేపట్టినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


గాంధారి మండలం పొతంగల్ కలాన్‌లోని కెనరా బ్యాంకుకు తరలివచ్చిన రైతులు

# రెండోసారీ..

- కొంతమందికే రుణమాఫీ
- అయోమయంలో రైతులు
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలకు పరుగులు

### ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో

రెండో విడుత రుణమాఫీపై గందరగోళం నెలకొన్నది. మొదటి విడుత మాదిరిగానే కొంతమంది రైతులకే మాఫీ వర్తించడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొన్నది. రూ.లక్షన్నర వరకు పంట రుణమాఫీ జాబితాను ప్రకటించగా అర్హులమైనా పేరు రాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు మొదటి విడుతలో మాఫీ రాని రైతులు సైతం రెండో విడుత కోసం ఎదురుచూడగా వారికీ నిరాశే మిగిలింది. మలివిడుత రుణమాఫీ ప్రక్రియ మొదలైనా తమ విషయంలో ఎలాంటి స్పష్టత రావడం లేదని వాపోతున్నారు. బ్యాంకులు, వ్యవసాయ అధికారులను అడిగినా ఫలితం ఉండడం లేదని పేర్కొంటున్నారు

### 20వేల రుణం కూడా మాఫీ కాలే..



మాక్లూర్, జూలై 31: గత ఏడాది మాక్లూర్ ఇండియన్ బ్యాంకులో రూ.20వేల పంట రుణం తీసుకున్న. మొదటి విడుతలో మాఫీ కాలేదు. వారం రోజులు బ్యాంకు చుట్టూ తిరిగిన.. ఇగ అస్తది.. అగ అస్తది అని చెప్పిండ్రు. మాఫీ మాత్రం కాలేదు. అన్నీ సక్రమంగా ఉన్నా మొదటి విడుతలో నా పేరు రాలేదు. రూ.20వేలు కూడా మాఫీ కాలే.. కానీ రూ.లక్షా50వేలు మాఫీ అనుకుంట రెండు విడుత లిస్టు పంపిండ్రు. అందులో కూడా నా పేరు లేదు. ఆశ్చర్యం వేసింది. ప్రభుత్వం మా గోస విని సమస్య పరిష్కరించాలి. అధికారులను అడిగితే ఇండియన్ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు సమస్య ఉన్నది.. ఎదురు చూడమని చెబుతున్నరు.

**-బూరోల్ల లక్ష్మన్, రైతు, ముల్లంగి(బీ)**

### ఎవరూ స్పందించడం లేదు..



చందూర్ , జూలై 31: నా పేరు ఎడ్ల సందీప్. మాది చందూర్. 2020 సెప్టెంబర్‌లో డీసీసీబీలో రూ.లక్షా15 వేలు పంట రుణం తీసుకున్నా. రెండో విడుత రుణమాఫీ జాబితాలో పేరు వస్తుందని ఆశించా. నా పేరు రాలేదు. గత ప్రభుత్వంలో ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పుడెందుకు సమస్య వచ్చిందని అధికారులను ప్రశ్నిస్తే.. వినతిపత్రం అందించాలని చెబుతున్నారు. మాఫీ ఎందుకు కాలేదో, ఎప్పుడు అవుతుందో కూడా అధికారులు, బ్యాంకు మేనేజర్లు చెప్పడం లేదు.

### మోచేతుకు బెల్లం పెడుతుంది



రెంజల్, జూలై 31: రేవంత్‌రెడ్డి సర్కారు పంట రుణం మాఫీ చేస్తామని చెప్పి రైతుల మోచేతికి బెల్లం పెడుతుంది. గతేడాది రెంజల్ కెనరా బ్యాంక్‌లో రూ.లక్షన్నర రుణం తీసుకున్న. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షన్నర రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పింది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

**- వేమూరి వెంకటేశ్వర్‌రావు, రైతు, దండిగుట్ట గ్రామం**



### బిల్లులు చెల్లించాలని

**బిల్లులు** చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోటగిరి తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు ధర్నా చేశారు. జిల్లాలో దాదాపు రూ.10కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని విన్నవించారు. బకాయిలను విడుదల చేస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

– కోటగిరి, జూలై 31

### అంతా గందరగోళంగా ఉన్నది..



నేను అయిలాపూర్ యూనియన్ బ్యాంకులో రూ.లక్షా 30వేల రుణం తీసుకున్నాను. నాకు రుణమాఫీ రాలేదు. మొదటి విడుత వస్తదేమోనని ఎంతో ఆశతో చూశాను. ఈ రెండో విడుత కూడా అదే ఆశతో ఎదురు చూసినా నిరాశే మిగిలింది. రుణమాఫీ ప్రక్రియ అంతా గందరగోళంగా ఉన్నది. కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకపోవడం సరికాదు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేయాలి. రుణమాఫీ జరగలేదని బ్యాంకు, వ్యవసాయ కార్యాలయానికి వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**- ముస్కు రాంరెడ్డి, రైతు, తల్వేద**

### రేషన్ కార్డున్నా రుణమాఫీ కాలేదు



నందిపేట్, జూలై 31: నేను తల్వేద గ్రామంలోని యూనియన్ బ్యాంకులో రూ.లక్షా 30వేల పంట రుణం తీసుకున్నా. రుణమాఫీ జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురుచూశా. కానీ రెండో విడుత రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. ప్రభుత్వం ఇష్టారీతిగా రుణమాఫీ చేస్తున్నది. అర్హులకు ఇవ్వకపోవడం అన్యాయం. మేము వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నాం. మాలాంటి నిజమైన రైతులకు కచ్చితంగా రుణమాఫీ చేయాలి.

**- కొట్టాల కలవ్వ, మహిళారైతు, తల్వేద, నందిపేట్**

### రెండో విడుతలో కూడా రాలేదు..



మాక్లూర్, జూలై 31: రూ.లక్షలోపు ఉన్నోళ్లందరికీ మాఫీ అన్నరు. మొదటి విడుతలో నాపేరు రాలే. రెండో విడుతల కూడా రాలే.. నాకు రెండు ఎకరాల పొలం ఉన్నది. గత ఏడాది ఇండియన్ బ్యాంక్‌లో రూ.90వేలు పంట రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభు త్వం, అధికారులు రూ.లక్షలోపు ఉన్న వారిని పట్టించుకోవాలె. అంతా గజిబిజిగా ఉన్నది. బ్యాంకు అధికారులు మాచేతుల్లో ఏమీ లేదంటున్నరు. నాకు మాఫీ అయితుందో లేదోనని టెన్షన్‌గా ఉన్నది.

**- బోత్తోల్ల భూమన్న,రైతు, మాక్లూర్**

## న్యాయం కోసం ఆత్మహత్యాయత్నం

- బాలికపై కామాంధుడి అఘాయిత్యం
- బాధితురాలికి ఇప్పటికీ దక్కని ప్రభుత్వ సాయం
- పరిహారం కోసం బాలిక తండ్రి ఆత్మహత్యాయత్నం

నవీపేట, జూలై 31: అఘాయిత్యానికి గురైన తన బిడ్డకు న్యాయం చేయాలని కోరుతూ ఓ తండ్రి ప్రాణత్యాగానికి సిద్ధమయ్యాడు. రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. నవీపేట మండలం ధర్యాపూర్ శివారులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక(15)పై నవీపేట వాసి సాయికృష్ణ కన్నేశాడు. నాలుగు నెలల క్రితం ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, బాధితురాలికి న్యాయం జరుగడం లేదని, ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2 లక్షల పరిహారం ఇంకా అందలేదని బాలిక తండ్రి ఆవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే అతడు బుధవారం దర్యాపూర్ వద్ద గల రైలుపట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టగా పోలీసులు అడ్డుకున్నారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

షెట్లూర్ గ్రామంలో డంప్ చేసిన ఇసుక



## పగలు ట్రాక్టర్లు.. రాత్రి టిప్పర్లు

- జోరుగా ఇసుక దోపిడీ
- అనుమతుల చాటున అక్రమ దందా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు యంత్రాంగం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

బాన్సువాడ, జూలై 31: ప్రజలకు ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ రంగం దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇసుక లభ్యత ఉన్న చోట రీచ్‌లను ఏర్పా టు చేసి రవాణాకు అనుమతులు ఇచ్చింది. పేదల ఇండ్ల పనులు మధ్యలో ఆగిపోకుండా ఉచితంగా ఇసుక అందిస్తామనే ఉద్దేశంతో కొన్ని క్వారీలకు అనుమతి ఇవ్వగా.. ఇదే ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమార్కులు ఇసుక దోపిడీకి తెరలేపారు. డివిజన్‌లోని డోంగ్లి, బీర్కూర్, బిచ్కుంద తదితర మండలాల్లోని సమీప వాగులు, మంజీరా పరీవాహక ప్రాంతాలను ఉదయం నుంచి రాత్రి వరకు జల్లెడ పడుతున్నారు. ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలించి శివారు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. రాత్రివేళల్లో కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, బాల్కి, మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి పట్టణాలకు టిప్పర్లలో తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంత జరిగినా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

### చర్యలు శూన్యం..

మంజీర పరీవాహక ప్రాంతాల నుంచి పగటిపూట దర్జాగా ట్రాక్టర్లలో, రాత్రి పెద్దపెద్ద లారీలు, టిప్పర్లలో ఇసుకను దూర ప్రాంతాలకు పంపుతూ జీరో దందా కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. బిచ్కుం ద మండలంలోని షెట్లూర్, ఖుర్లా గ్రామాలకు చెందిన బడా బాబులు ట్రాక్టర్, లారీలను లెక్కించి అధికారులకు ముడుపులు ఇచ్చుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుకు వెయ్యి, లారీకి రూ.5వేల చొప్పున మధ్యవర్తులు అందిస్తున్నట్లు గ్రామాల్లో బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు.

### ట్రాక్టర్లతో డంపు.. టిప్పర్లతో జంపు


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుం ద మండలం హస్గుల్, పుల్కల్, ఖండ్‌గావ్, గుండెనెమ్లి గ్రామాల్లో కొంతకాలం క్రితం టీఎస్ఎండీసీ ద్వారా ఇసుక వే బిల్లులను జారీ చేసింది. ఆయా క్వారీల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన వ్యాపారులు అక్రమంగా ఇసుకను తరలించడంతో ఫిర్యాదులు రాగా.. క్వారీల నుంచి ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. మరోవైపు బిచ్కుంద,బీర్కూర్, డోంగ్లి మండలాల్లోని పలు చెరువుల నుంచి ఇసుకను కొంత మంది ట్రాక్టర్లలో తరలించి దర్జాగా విక్రయిస్తున్నారు. హస్గుల్ సమీపంలోని మంజీర నుంచి తరలిస్తున్న ఇసుకను పొద్దంతా మెయిన్‌రోడ్డుపై డంపింగ్ చేసి రాత్రివేళల్లో టిప్పర్, లారీల్లో రవాణా చేస్తున్నారు. 5వ నంబర్ క్వారీ నుంచి తరలించిన ఇసుకను బిచ్కుంద మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే స్కూల్ వెనుకభాగం గుట్ట ప్రాంతంలో డంప్ చేస్తూ అర్ధరాత్రి వేళల్లో కర్ణాటక, మహారాష్ట్ర , హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు టిప్పర్లలో సాగనంపుతున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుకకు రూ.50 వేల చొప్పున వసూలు చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తున్నది.

### చర్యలు తీసుకుంటాం..



డివిజన్‌లోని ఏ మండలం, ఏగ్రామంలోనైనా మంజీర పరీవాహక ప్రాంతం, లేదా వాగుల నుంచి ఇసుకను తోడి అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో, లారీల్లో రవాణా చేసినా, అర్ధరాత్రి వేళల్లో ఇసుకను నింపినట్లు తెలిస్తే.. సమాచారం ఇవ్వాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. అక్రమార్కులు గతంలో డంపింగ్ చేసిన ఇసుకను సీజ్ చేశాం.

**- రాథోడ్ రమేశ్, ఆర్డీవో, బాన్సువాడ**

### జలపరవళ్లు..



**ఇందూరు నయాగారాగా** పేరొందిన సిర్నాపల్లిలోని శీలం జానకీబాయి చెరువు నుంచి పారుతున్న అలుగు ప్రజలను ఆకట్టుకుంటున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి మత్తడి పారుతున్నది. 40 అడుగుల ఎత్తు నుంచి దూకుతున్న జలపరవళ్లు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.దీంతో సిర్నాపల్లి వాటర్‌ఫాల్స్‌ను సందర్శించేందుకు జనం తరలివస్తున్నారు.

– ఇందల్వాయి, జూలై 31

### ఇసుక రవాణాను అరికట్టాలి..

పొతంగల్, జూలై 31: ఇసుక రవాణాను అరికట్టాలని తహసీల్ కార్యాలయంలో పొతంగల్ గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజీర నుంచి రాత్రింబవళ్లు ఇసుక తోడేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గంట్ల విఠల్, గంధం పవన్,బండారి గంగారాం, సుధం పరశురాం, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పొతంగల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను ఆర్ఐ సాయిలు సిబ్బందితో కలిసి బుధవారం సీజ్‌చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు